క్లుప్తంగా

5లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నడిగూడెం : నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన మండల రైతులు వచ్చేనెల 5లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి బి.రాజు కోరారు. గురువారం మండల పరిధిలోని కరివిరాల, రత్నవరం గ్రామాల్లోని రైతువేదికలలో రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో రైతు బీమా చేయించుకున్న రైతులు అందులో నామినీ మార్పులు, చేర్పులు ఉంటే ఈనెల 30లోగా సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారులకు దరఖాస్తులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు రేష్మా, మౌనిక, రైతులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

మఠంపల్లి : మండలంలోని గుర్రంబోడు ఆశ్రమ పాఠశాలలో గురువారం మండల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

27న వాహనాల వేలం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేయబడిన 10వాహనాలకు ఈనెల 27న వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎక్సైజ్‌స్టేషన్‌లో నిర్వహించే వాహనాల వేలంలో పాల్గొనే వారు అదే రోజు ఉదయం 9గంటలకు స్టేషన్‌లో ముందస్తుగా దరావత్ రుసుము చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

మేళ్లచెరువు : అక్రమంగా నిషేధిత గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్న ఇరువురిపై మండల పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మండల ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి కలిదిండి నరసింహారావు అనే వ్యక్తి నుంచి 12,740 ప్యాకెట్లు, చిన్నపంగు సుధాకర్ అనే వ్యక్తి నుంచి 260గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.4600 ఉంటుందన్నారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పంచాయతీ సిబ్బందికి యూనిఫాం పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న డీఎల్‌పీఓ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని బూరుగడ్డ గ్రామపంచాయతీ సిబ్బందికి గ్రామానికి చెందిన మంత్రిప్రగడ రమేష్ జ్ఞాపకార్థం అతడి సతీమణి గిరిజాకుమారి, కుమారుడు విశ్వామిత్ర, కుమార్తె యశోదరలు యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ యాదగిరి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గిరిబాబు పాల్గొని సిబ్బందికి పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. దాతలు యూనిఫాం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.

బడ్జెట్‌ను పూర్తిగా ఖర్చుచేయాలి

మోతె : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం, దళిత, గిరిజన, విద్య, వైద్య రంగాలకు కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిగా ఖర్చు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. గత పది సంవత్సరాల బడ్జెట్ కేటాయింపులు జరిగినప్పటికీ అవి పూర్తిగా ఖర్చు చేయలేదన్నారు. దళిత, గిరిజన ప్రణాళికలో ఏనాడు 60శాతానికి మించి వ్యయం చేయకపోవడంతో ఆ వర్గాలు దారిద్ర్యం నుంచి బయటపడలేదన్నారు. అందువల్ల కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిగా ఖర్చు చేయాలని కోరారు.

సదస్సును జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : మఠంపల్లి మండల కేంద్రంలో ఈనెల 30, 31తేదీల్లో నిర్వహించనున్న గిరిజన సంఘం చైతన్య సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండు కోరారు. గురువారం హుజూర్‌నగర్‌లో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మం, వెంకటేశ్వర్లు, వెంకన్న, సక్కుబాయి, అనిల్, చంద్రు, సోనీ, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా లింక్ రోడ్లు !

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- బీటీరోడ్లు నిర్మించాలని గ్రామస్తుల వేడుకోలు



బురదమయంగా శ్రీరంగాపురం నుంచి సిరిపురం గ్రామానికి వెళ్లే రహదారి



గుంతలమయంగా మారిన వల్లాపురం వెళ్లే రహదారి

నడిగూడెం : పేరు గొప్ప, ఊరు దిబ్బ అన్నచందంగా మారింది నడిగూడెం మండలం. అభివృద్ధిలో పేరున్నా పలు రకాల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రధానంగా నడిగూడెం మండలంలో అంతర్గత రహదారులు, ఇతర గ్రామాలకు వెళ్లే లింక్‌రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

గుంతలయమంగా మారిన రోడ్లు ఇవే..

మండలంలో ప్రధానంగా శ్రీరంగాపురం నుంచి సిరిపురంకు, వల్లాపురం నుంచి శ్రీరంగాపురం వెళ్లే రహదారి, కరివిరాల నుంచి వేణుగోపాలపురం వెళ్లే రహదారి, వేణుగోపాలపురం నుంచి శ్రీఆంజనేయనగర్‌కు వెళ్లే రహదారి లోతైన గుంతలమయంగా మారింది. ఎకలాస్‌ఖాన్‌పేట నుంచి తెలబల్లికి వెళ్లే రహదారి, నడిగూడెం నుంచి మునగాల మండలం నారాయణగూడెంకు వెళ్లే రహదారి గుంతలు, కంపచెట్లమయంగా మారింది. అదే విధంగా వల్లాపురం నుంచి చనుపల్లి గ్రామానికి వెళ్లే రహదారి కంకర తేలి అనేక చోట్లలో దెబ్బతిన్నది. ఈ రోడ్లలో చినుకు పడితే చిత్తడిగా మారి రాకపోకలకు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నారాయణపురం క్రాస్ రోడ్డు నుంచి నారాయణపురం గ్రామంలోకి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వరకు బీటీ వేసేందుకు కంకరపరిచారు కానీ ఇప్పటి వరకు బీటీ వేయలేదు. దీంతో ఆ గ్రామానికి, ఆ గ్రామం మీదుగా సిరిపురం, వల్లాపురం ఇతర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టులు..

మండల పరిధిలోని రత్నవరం గ్రామసమీపంలో ఉన్న కల్వర్టు, వల్లాపురం వద్ద ఉన్న కల్వర్టు పూర్తిగా దెబ్బతిన్నాయి. కల్వర్టులు దెబ్బతినడంతో రాత్రి సమయాల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. లోతైన గుంతలు ఏర్పడడంతో కొత్తగా వచ్చే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలమయంగా మారిన లింక్‌రోడ్లుకు, అంతర్గత రహదారులకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం



"సిరిపురం గ్రామం నుంచి శ్రీరంగాపురం గ్రామానికి వెళ్లాలంటే నడిచి వెళ్తుంటాం. పలు చోట్ల రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. అలాగే రహదారికి లోతైన గుంతలతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రహదారికి ఇరువైపులా కంపచెట్లు ఉన్నాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

– గుండ్లపల్లి బుచ్చిరాములు, సిరిపురం

అధికారులు స్పందించాలి



"శ్రీరంగాపురం నుంచి వల్లాపురం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. పొలాల నుంచి వచ్చే నీరు రోడ్డుపై చేరడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. నిత్యం ఈ రహదారిపై అనేక మంది రైతులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి బీటీ రహదారి ఏర్పాటు చేయాలి.

– బండారు రవి, శ్రీరంగాపురం

పెరటి తోటల పెంపకంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎస్.సుగంధి

గరిడేపల్లి : మండల పరిధిలోని గడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పెరటి తోటల పెంపకంపై గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎస్.సుగంధి విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిరోజు పండ్లు, కూరగాయలు తీసుకోవడం తప్పనిసరి అని అన్నారు. మనకు ప్రతి దినం కావాల్సిన పోషక విలువలు, విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు, పండ్లు కూరగాయలలో ఎక్కువగా లభిస్తాయన్నారు. రోగ నిరోధకశక్తి పెంచడానికి అవసరమైన పోషకాలు అందించడంలో అవి ప్రాముఖ్యత వహిస్తాయన్నారు. పండ్లు, కూరగాయలను ఇంటి ఆవరణలో చుట్టు పక్కల పెరడులో గానీ, ఇంటి మేడపైన గానీ పెంచుకోవచ్చన్నారు. పెరటి తోటల పెంపకంతో ఆరోగ్యమే కాకుండా, ఇంటి వారందరికీ తీరిక వేళల్లో మొక్కల మధ్య పనిచేయడం ద్వారా మనోల్లాసం, ఆహ్లాదం లభిస్తుందన్నారు. అన్ని పాఠశాలల్లోని ఆవరణల్లో కిచెన్ గార్డెన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించి వారికి అన్ని రకాల కూరగాయల విత్తనాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డి.ఆదర్శ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

గరిడేపల్లి : సివిల్స్‌లో దివ్యాంగులకు రిజర్వేషన్లు అవసరమా అంటూ దివ్యాంగుల కోటపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ వెంటనే వికలాంగుల సమాజానికి క్షమాపణ చెప్పాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో స్మితా సబర్వాల్ చిత్రపటానికి కోడిరక్తంతో రక్తాభిషేకం చేసి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిద్దె రాజేష్ మాట్లాడుతూ.. వికలాంగులను అవమానపరిచిన స్మితా సబర్వాల్‌పై కేంద్రంలోని నరేంద్రమోదీ, రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకొని ఆమె ఐఏఎస్‌ను రద్దు చేసి వికలాంగుల హక్కుల చట్టం 2016 నిబంధనల మేరకు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో స్మితా సబర్వాల్‌పై కేసు నమోదు చేయాలని ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం నరేష్‌రెడ్డి, మచ్చ శ్రీను, రాపోలు నవీన్, యాకూబ్, అశోక్, ఎల్లయ్య, నరసింహ, మోహిత్, పాషా తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని ఆస్పత్రుల సీజ్



అనుమతిలేని ఆసుపత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

నేరేడుచర్ల : పట్టణంలో అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించని రెండు ఆసుపత్రులను కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు గురువారం సీజ్ చేశారు. మున్సిపల్ కేంద్రంలోని శ్రీఅమ్మ ఆసుపత్రి, శ్రీసాయి శ్రీనివాస్ ఆసుపత్రులలో వైద్యాధికారి నాగిని తనిఖీ చేశారు. అనంతరం ఆ రెండు ఆస్పత్రుల రిజిస్ట్రేషన్, ఫార్మసీ, ల్యాబ్ టెక్నిషియన్, డ్యూటీ డాక్టర్ గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఆసుపత్రిలో డాక్టర్లు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్ నిర్వహిస్తూ ఇన్ పేషెంట్లకు నియమ నిబంధనలు పాటించకుండా చికిత్స చేస్తున్నందున సీజ్ చేసినట్లు డాక్టర్ నాగిని తెలిపారు. ఆసుప్రతులను నిర్వహించే ప్రతిఒక్కరూ ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించి అనుమతులు తీసుకొని రోగులకు చికిత్స అందించాలన్నారు. ఆమె వెంట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ నరసయ్య తదితరులున్నారు.

మానవత్వం మంటకలిసిన వేళ

- తల్లి మృతదేహం సాక్షిగా కుమార్తెల ఆస్తి పంపకాల పంచాయితీ
- పెద్దమనుషులు సర్దిచెప్పడంతో అంత్యక్రియలు పూర్తి

కోదాడరూరల్ : తల్లి మృతదేహం సాక్షిగా ముగ్గురు కుమార్తెలు ఆస్తి పంపకాల్లో తేడాలు వచ్చాయని పంచాయితీకి దిగారు. ఈ ఘటన పట్టణ పరిధిలోని పాత పోస్టాఫీస్ వీధిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోస్టాఫీస్ వీధికి చెందిన వెలిదినేని నాగమణి(85)కి ముగురు కుమార్తెలు ఉన్నారు. వారికి నాగమణి ఉన్నత స్థితిలో ఉన్నవారితో వివాహం చేసింది. భర్త 20ఏళ్ల కిందట చనిపోవడంతో కొద్ది సంవత్సరాలు కోదాడలోనే ఉంటూ.. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఉంటున్న చిన్నకూతురు వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో కోదాడలో ఉన్న 460గజాల విలువైన ఇంటి స్థలంలో వారి మధ్య పంచాయితీ మొదలైంది. దీంతో ఆ ఇంటి స్థలాన్ని పెద్దమనుషుల సమక్షంలో ముగ్గురు కుమార్తెలతో పాటు ఆమెకు కలిపి నాలుగు భాగాలుగా పంపిణీ చేశారు. అయితే ఆమె వాటాను కూడా చిన్న కుమార్తెకు రిజిస్ట్రేషన్ చేయడంతో మిగిలిన ఇద్దరు కూతుర్లు గొడవకు దిగారు. ఈ పంచాయితీ కోర్టు వరకు చేరింది. ఇది ఇలా ఉండగా 20రోజులు కిందట నాగమణి కోదాడకు వచ్చి ఆ స్థలంలో రెండో కూతురు నిర్మించుకుంటున్న ఇంట్లో ఉండేందుకు ప్రయత్నించగా ఆమె తాళం వేయడంతో ఆ వీధిలోనే బంధువుల ఇంట్లో తింటూ అక్కడే పడుకుంటుంది. ఈ నేపథ్యంలో నాగమణి బుధవారం తీవ్ర అనారోగ్యం పాలై మృతి చెందింది. దీంతో తల్లి మృతదేహం వద్దకు చేరిన ముగ్గురు కుమార్తెలు అంత్యక్రియలు నిర్వహించకుండా గురువారం గొడవకు దిగారు. పెద్దలు చెప్పినా వినకపోవడంతో స్థానికులు, బంధువులు కన్నతల్లి మృతదేహాన్ని రోడ్డుపై పెట్టి పంచాయితీ ఏంటని ప్రశ్నించారు. మధ్యాహ్నం వరకు అంత్యక్రియలు నిర్వహించకపోతే తామే చేస్తామని పెద్దమనుషులు తేల్చిచెప్పడంతో తల్లి అంత్యక్రియల ప్రక్రియను ముగించారు.

బస్టాండ్‌లో గుంతలు పూడ్చివేత

మోతె : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ గుంతలమయంగా మారడంతో గురువారం తక్షు క్రషర్ మిల్ యజమాని వంగాల కిరణ్‌కుమార్‌గౌడ్ రూ.80వేల విలువగల కంకరతో గుంతలను పూడ్చించారు. బస్టాండ్ రోడ్డు గుంతలమయంగా మారడంతో ఐదు సంవత్సరాల నుంచి బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు సమస్యను తమ దృష్టికి తీసుకెళ్లడంతో గుంతలు పూడ్చించినట్లు క్రషర్ మిల్ యజమాని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రయాణికులు క్రషర్ మిల్ యజమానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కోదాడరూరల్ : మండలంలోని కాపుగల్లు గ్రామానికి చెందిన చెరుకుపల్లి రాంబాబు భార్య హైమావతి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. గురువారం వెంకటాచారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేపూరి వెంకటాచారి పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట వినుకొండ కొండలరావు, చెరుకుపల్లి రాధాకృష్ణ, నాగేశ్వర్‌రావు, తిరుపతిరావు, మహేష్, బక్కా నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

13క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కోదాడరూరల్ : మండలంలోని గుడిబండలో అక్రమంగా నిల్వచేసిన 13క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన కుటుంబరెడ్డి గుడిబండలో రేషన్‌బియ్యాన్ని కేజీ రూ.8లకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ఆంధ్రాలో విక్రయించేందుకు ఓ ఇంట్లో నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేయగా 26బస్తాల్లో 13క్వింటాళ్ల బియ్యం పట్టుబడినట్లు తెలిపారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసి విక్రయిస్తున్న కుటుంబరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ విధానం రద్దుచేయాలి

హుజూర్‌నగర్ : గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. గురువారం పట్టణంలో గ్రామపంచాయతీ కార్మికుల మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇవ్వాలని, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు షేక్ అస్సాన్ మియా, కార్మికులు కొప్పుల వీరారెడ్డి, చలికంటి శ్రీను, పాదిల నాగరాజు, పారుపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



తీజ్ వేడుకల్లో పాల్గొన్న గిరిజన మహిళలు

మఠంపల్లి : మండలంలోని రామచంద్రాపురం తండాలో గురువారం గిరిజన మహిళలు, యువతులు, బాలికలు తీజ్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎనిమిది రోజుల పాటు ఆచార సంప్రదాయాల ప్రకారం పెంచిన గోధుమనారు బుట్టలను ఎత్తుకుని 9వరోజు స్థానిక దేవాలయం వద్ద ఆడిపాడి స్థానికంగా గల వాగులు, బావులలో జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుజ్జిభీముడునాయక్, గ్రామపెద్దలు, మహిళలు, యువతులు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ పూజలు



జెడ్పీ డిప్యూటీ సీఈఓకు శ్రీస్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గురువారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఆమెకు ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరు విజయ్‌కుమార్, అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనంతో శ్రీస్వామి వారి చిత్రపటం బహూకరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, టైపిస్టు నాగాంజనేయులు, కార్యదర్శి చంద్రశేఖర్, అర్చకులు పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, తదితరులున్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డుల తనిఖీ..

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలో సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు సక్రమంగా పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ ఆంజనేయులు, రిటైర్డ్ ఎంపీడీఓ జానకిరాములు, మణి, తదితరులున్నారు.



మునగాల : ముకుందాపురంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఈఓ శిరీష

గ్రామపంచాయతీ రికార్డుల తనిఖీ

మునగాల : మండల పరిధిలోని ముకుందాపురం గ్రామపంచాయతీని గురువారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి శిరీష సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను అప్‌డేట్ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, మండల పంచాయతీ అధికారి ఎస్.భూపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కాసాని రవి, సిబ్బంది ఉన్నారు.

సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

గరిడేపల్లి : నాగార్జునసాగర్ ఎడమకాల్వ నుంచి జిల్లాలోని చెరువులు, కుంటలను నింపాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్ ఎడమకాల్వ మీద ఉన్న తూములను మూసీవేసి పోలీసు బందోబస్తుతో ఖమ్మం జిల్లాకు సాగునీటిని తీసుకెళ్లడం అన్యాయమని, జిల్లాలోని చెరువులు, కుంటలు నింపిన తర్వాతే ఖమ్మం జిల్లాకు నీటిని తీసుకెళ్లాలన్నారు. గత సంవత్సరం వానాకాలం, యాసంగి సాగర్ నీరు రాక భూగర్భజలాలు అడుగంటాయని, దీంతో బోర్లు, బావులు ఎండిపోయి, వేసిన పంట చేతికి రాక ఎకరాకు రూ.40వేలు రైతులు నష్టపోయారని అన్నారు. సాగర్ ఆయకట్టు రైతాంగం నార్లు పోసుకొని, మరికొందరు నాట్లు కాకుండా వడ్లు చల్లుకొని ఉన్నారని, ఇటీవల కురుస్తున్న వర్షాలకు నార్లుపెగిరి నాటుకు అందే దశకు వచ్చాయని, పైన ప్రాజెక్టులలో జలకళ వచ్చినందున, చెరువులు, కుంటలు నింపితే భూగర్భజలాలు పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, యడ్ల అంజిరెడ్డి, చేవ వెంకన్న, ఏఐటీయూసీ నాయకులు యడవెల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

చిలుకూరు : కౌలు రైతులకు రైతు భరోసా కల్పించాలని తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణను నిధులు కెటాయించలేదని విమర్శించారు. అనంతరం కౌలు రైతుల సంఘం గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కొండా వెంకయ్య, ఉపాధ్యక్షుడిగా పిల్లుట్ల కనకరావు, కార్యదర్శిగా యలగొండ ప్రభాకర్, కోశాధికారిగా కేతిరెడ్డి నాగిరెడ్డి, సభ్యులుగా అల్లి వీరబాబు, పుట్టపాక సత్యనారాయణ, అచ్చయ్య, రాంబాబు, వెంకటిని ఎన్నుకున్నారు. సమావేశంలో కౌలు రైతులు బెల్లంకొండ నాగయ్య, గంగిరెడ్డి రవీందర్‌రెడ్డి, నాశబోయిన రామయ్య, కొండా వీరమ్మ, గురవయ్య, లక్ష్మీనారాయణ, పున్నయ, లక్ష్మీనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

కులవృత్తులకు రాష్ట్ర బడ్జెట్‌లో మొండిచేయి

మేళ్లచెరువు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కులవృత్తులకు మొండిచేయి చూపిందని బీఆర్‌ఎస్ మండల నాయకుడు జనిగ సైదులుయాదవ్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్రంలోని అన్ని కులాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తరువాత వారిని విస్మరించారన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో గొల్ల కురుమలకు గొర్రెలు అందిస్తామని చెప్పి ఇప్పుడు ఎటువంటి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా పశువులు, జీవాలపైనే ఆధారపడిన గొల్లకురుమలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అధికారం చేపట్టి 8నెలలు గడుస్తున్నా నేటి వరకు పశుసంవర్థక శాఖకు మంత్రిని కేటాయించకపోవడం వారి అసమర్థపాలనకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీలను అమలు చేసి సంబండ వర్గాలను ఆదుకోవాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ సైదిరెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అమరవరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలను కూడా హామీ చేయకపోవడం దారుణమన్నారు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ సహకరిస్తుందనుకుని ప్రజలు ఆపార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో 8స్థానాలలో గెలిపించారన్నారు. ఎప్పటికైనా బీఆర్‌ఎస్ పార్టీతోనే తెలంగాణకు మేలు జరుగుతుందన్నారు. ఆయన వెంట నాయకులు అబ్దుల్ నబీ, అంజిరెడ్డి, నాగరాజు, చినలింగారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలి



సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

గరిడేపల్లి : ఉపాధ్యాయుల పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని తుంబాయిగడ్డ, కస్తూరి బా గాంధీ పాఠశాల, గానుగబండ, కల్మలచెరువు, పరెడ్డిగూడెం, సర్వారం, కీతవారిగూడెం పాఠశాలల్లో నిర్వహించిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెండింగ్ కరువు భత్యాన్ని మంజూరు చేయాలన్నారు. కేజీవీబీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలన్నారు. 317బాధితులకు స్థానికత ఆధారంగా న్యాయం చేయాలని, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు 010పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలని, పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల బాధ్యులు ఎలక సైదిరెడ్డి, సీనియర్ నాయకులు బాల సైదిరెడ్డి, రవీందర్, సైదులు, వెంకట్‌రెడ్డి, నాగేశ్వరరావు, వీరస్వామి, రాంబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

28న రవన్న సంతాప సభ

భానుపురి : ఈ నెల 28వ తేదీన ఖమ్మంలో జరిగే రాయల రవన్న సంతాప సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. గురువారం పట్టణంలోని లెనిన్ నగర్‌లో పార్టీ ఆధ్వర్యంలో సంతాప సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, పార్టీ డివిజన్ నాయకులు ఎస్‌కే. సయ్యద్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు వాజీదు, వీరబాబు, సూరం రేణుక, జయమ్మ పాల్గొన్నారు.